
# వారసత్వం నాకూ కావాలి




'ఏదీ ఒకరూపాయి యివ్వు' అని తనని అడిగి తీసుకుని కాఫీత్రాగి ఒక కేప్‌స్టన్ పెట్టి కొనుక్కుందామని, తనతో కలసి బీచికి షికారుపోయి మన్నూ మిన్నూ ముద్దు పెట్టుకునే దృశ్యం చూసి ఆనందిద్దామనీ, తనకొంగు పట్టుకుని వేళ్ళాడే పాపాయిని ఎత్తుకుని పాలబుగ్గలమీద ముద్దు పెట్టుకుందామనీ—నాకూ వుంది. కాని...ఏం లాభం. ఊహించుకున్న వన్నీ నెరవేరుతాయా?—మనస్సుకేం విమానంలో విహరిస్తుంది. బెట్టీ డేవిస్ పక్కన కూర్చుని బ్యూక్ కారులో షైరు కొడుతుంది. క్షణంలో అమెరికాపోయి ఎంపైర్ స్టేట్ బిల్డింగ్సులో నూటనాల్గో అంతస్తునుండి క్రింద పోయే కార్లవరుసల్ని చీమలబారుగానూ, పరిసరాల్లోవుండే యిళ్ళను పాకల్లాగానూ చూస్తుంది. మనస్సు ఆవిధంగా ఊహలో విహరించినంత మాత్రాన యివన్నీ నిజంగా జరిగాయని మనం తృప్తిపడగలమా?—అట్లా తృప్తిపడలేం కాబట్టే నేను పెళ్ళి చేసుకోననేది. అందరూ పెళ్ళి చేసుకో మనేవారే కాని తనూ నేనూ కలసి సెకండు క్లాసులో (పూర్వపు సెకండుక్లాసు లెండి, యిప్పటి క్లాస్ 'టు' కాదు) శ్రీనగర్ వెళ్ళివస్తామంటే టిక్కెట్లు కొనిచ్చేదెవరు? 'పెండ్లి చేసుకొని శ్రీనగర్ ఎందుకయ్యా వెళ్ళటం, యింట్లో పడి వుండక' అని మీరు అడుగవచ్చు. కాని ఏదో నాల్గువూళ్ళు తిరిగినవాడిని, 'సెకండు క్లాసు, శ్రీనగరు'కంటె చిన్నవూహాలు ఎట్లా వూహించ గలను? మొన్న బెజవాడ స్టేషనులో ఆ వులెన్ సూటు ఆయన మిల్కువైట్ చీర కట్టుకొని మొదటితరగతి పెట్టెలో కూర్చున్న తన యిల్లాలికి యిడ్లెన్లు కిటికీగుండా అందిస్తుండగా చూసి ఎంత ముచ్చటపడ్డానో మీకేం తెలుస్తుంది? ఏం నాకుమాత్రం అట్లా వుండదూ? పోనీ మొదటితరతి కాకపోయినా రెండవతరగతి కిటికీలోంచయినా కాస్త కాఫీ తనకి అందించి సగర్వంగా అటూ యిటూ చూద్దామని నాకూవుంది. కాని...—'శ్రీనగర్ వొద్దు, కిటికీలువొద్దు,ఆ వున్నపొలం కాస్తా దున్నుకొంటూ భార్యనీ (కలిగితే) పిల్లల్నీ పోషించుకోరా' అని చెప్పటానికేం చెప్పేస్తారు. మీరెన్ని చెప్పినా-నీగాపుగొను తొడుక్కుని మాఅమ్మాయి కాన్వెంటుకి వెళ్ళాలనే నామనస్సుకి వుంటుంది, కాని పొద్దున్నే చద్దిగంజి నెత్తినపెట్టుకుని వాకోసం పొలం రావాలని వుంటుందా?—'వాళ్ళందరూ పెద్దపెద్ద ఉద్యోగాలు చేసుకొంటున్నారు, అందువల్ల వాళ్ళపిల్లల్ని కాన్వెంటులో కాకపోతే కాశీలో చదివించుకుంటారు. నీకేం వుందిరా నాగమ్మా' అంటారు చులాగ్గా మీరు. నిజమే. నాకూ పెద్దవుద్యోగం చేద్దామనేవుంది. రాజగోపాలాచారిగారు రాజీనామా యిచ్చిన ఉత్తరక్షణంలో ఆ పదవి అంగీకరించటానికి సిద్ధంగా వున్నాను. కాని ఏంలాభం?— రాజగోపాలాచారిగారు రాజీనామా యిచ్చేదీలేదు. నా అంగీ

కారాన్ని అంగీకరించేవాళ్లూ లేరు. 'పెద్ద వుద్యోగం చేయటానికి నువ్వేమంత పెద్దచదువు చదివావోయ్' అని చులాగ్గా అనేవాళ్లేగాని ప్రధాన మంత్రికి ప్రయివేట్ ట్యూషను చెప్పగలనన్న నగ్నసత్యాన్ని యింతజనాభాగల యీ దేశంలో కనీసం ఒక్కడయినా ఆలోచించటానికయినా అంగీకరిస్తాడా?

మా బాబయ్యగారితో కలిసి కార్లో వెడుతూంటే త్రోవపొడుగునా ఎంతోమంది ఆయనకు నమస్కరించేవారు. ఆ నమస్కారాల్లో కనీసం సఖంవంతైనా నావేనని సంతోషించేవాడిని ఆరోజుల్లో. అటువంటి నన్ను అడుగడుక్కీ దణ్ణాలుపెట్టే గుమాస్తాపని చెయ్యమంటే ఎట్లా చెయ్యగలను చెప్పండి. నా గుమాస్తాగిరీ అటుంచి నా అర్థాంగిని ఫలానా గుమాస్తాగారి భార్య అని ఎవరయినా అంటే నేనెట్లా సహించి వూరుకునేదీ?- అదుగో-అందుకనే నేను పెళ్ళిచేసుకోననేది—రెండువేలు యిస్తామని ఒకళ్లూ, మూడు వేలుయిస్తామని ఒకళ్లూ, పిల్ల చక్కటిదని మరొకళ్లూ—రెండువేలూ మూడువేలూ ఎందుకు పనికివస్తయ్? కాకపోతే తిరిగిరాని పద్ధతిలో కాశ్మీర్ వెళ్ళటానికి చాలు. నాకు మాత్రం బ్రహ్మచారి వెధవనైపోదామని వుంటుందా? 'వదినా, అన్నయ్య పిలుస్తున్నాడు' అని సుబ్బారావు అంటోంటే వినాలని నాకు మాత్రం వుండదూ?

బిన్నీ కోటా వచ్చిందేమో కనుక్కుందామని బూల్చంద్ షాపుకి వెళ్ళినవాడిని ఆ సంగతి మరచిపోయి అద్దాల వెనుక కనిపిస్తున్న బొమ్మకేసి చూస్తూ అల్లాగే వుండిపోయాను, అరగంట సేపు. ఆ చీరె ఎవడు తయారుచేశాడో నాప్రాణాలు తియ్యటానికి. నిర్జీవమైన ఆ ప్రతిమకు ప్రాణం పోసింది. కట్టెలాగున్న ఆబొమ్మకే అంతఅందం, ఠీవి కలిగించిన ఆ చీరె రక్తం, మాంసం, ప్రాణంవున్న మనిషికి కడితే అమాంతం రంభని చేసెయ్యదూ? అప్పుయినాచేసి ఆ చీరెకొని పొడుపుగా పెట్టి అడుగున దాచి పెళ్ళయాక పెళ్ళానికి కట్టబెడదామనుకొన్నాను. సరే అప్పు ఎవడూ యివ్వలేదనుకోండి. ఇంతకీ చెప్పొచ్చే దేమిటంటే తీరా వాళ్ళనీ వీళ్ళనీనమ్ముకుని పెళ్లి చేసుకుంటే యిప్పుడు యివ్వని వాళ్లు అప్పుడు మాత్రం అప్పుయిస్తారన్న నమ్మకమేకి! పెళ్లే కనక అయితే ఆ చీరె మా ఆవిడకు కట్టకుండా ప్రాణాలు [illegible] ధైర్యం నాకు వుండనేవుంది. తత్ఫలితంగా నాకు సూయిసైడో, జైలో ప్రాప్తించవచ్చు. సూయిసైడు చేసుకునేవాళ్లల్లో నేను ఆఖరువాడిని. ఇక జైలు; జైలుకి వెళ్లేవాడినైతే సహాయనిరాకరణ దినాల్లో కళావారితోనే కలిసి వెళ్లేవాడిని. ఎటొచ్చీ జైలుకి వెళ్ళడమే ఆశయంగా పెట్టుకున్నవాడిని కానందువల్లనూ, ఇల్లరికపు టల్లుడులా జైల్లో భోజనాలుచేస్తూ కూర్చునేకన్న బయటవుంటే నాకు చేతనైనంతలో శారీరకంగానూ, మానసికంగానూ, ఆర్థికంగానూ దేశసేవచేద్దామన్నా వుద్దేశ్యం కల వాడిని కనుకనూ అట్లా జరగలేదు. లేకపోతే నాకుమాత్రం తెలీదూ, జైలుకి వెడితే పత్నీ సమేతంగా వెండి రథంమీద ఊరేగవచ్చని! పోనీ అంత అదృష్టం నాకు పట్టకపోయినా కనీసం మంత్రిపదవి లభించినా ఎనభైవేలు పెట్టి మాంబళంలో మేడకట్టుకొని హాయిగా జీవితం గడుపుతూ అప్పుడప్పుడు అరకువాలీ ఎక్స్కర్షను పోయేవాడినిగా. అథమం ఎమ్. ఎల్. ఎ. ని అయినా మంత్రిపదవి కావాలని గోల పెట్టేవాడిని కానే! ఎమ్. ఎల్. ఎ. మాత్రం ఏం తక్కువ? నన్నడిగితే డెర్బీ స్వీప్‌లో ఫస్టుప్రయిజు వచ్చిన వాడికంటె ఎమ్. ఎల్. ఎ. యే అదృష్టవంతు డంటాను. కాంగ్రెసువాడిని కాకపోబట్టి వెండిరథాల్ని, మంత్రిపదవుల్నీ, పెర్మిట్లనీ గురించి ఆలోచించటానికి సహజంగా నాకు అర్హతలేకపోతే లేకపోవచ్చు. పోనీ నాకు సుస్తీ చేసినప్పుడు స్పెషల్ వార్డులో తిరుగుతున్న పంకా కింద స్ప్రింగుమంచంమీద పడుకునివుంటే, మా ఆవిడ కాస్త సగ్గు బియ్యపు క్షీరాన్నం చెంచాతో నోటికి అందిస్తోంటే చప్పరించటానికయినా అర్హతవుందా అంటే అదీ లేదు. అందుకే నేను పెళ్ళి చేసుకోననేది.

తమ మహిళామండలి ప్రోగ్రాములో మాట్లాడుతూంటే సిగరెట్టుపొగ సాఫీగా వదుల్తూ ఆ ఏర్పడిన చిన్న మేఘాల్లో అర్థాంగి ఆకారాన్ని, అవయవసౌష్ఠవాన్ని, ఆమె పెదవుల కదలికల్ని వూహించుకుంటూ నా ఎదుటి పదార్థం రేడియో అన్న సంగతి మరచి టెలివిజన్ సెట్టు అన్న తియ్యటి భావంలో లీనమైపోదామనీ నాకూవుంది. కాని... ?